క్లుప్తంగా

వీరన్నకు సత్కారం



వీరన్నను సత్కరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

కొవ్వూరు: అనపర్తిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న శుక్రవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరన్నకు ఎమ్మెల్యే చిరు సత్కారం చేశారు. ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగార్జున, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కామన రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

కొవ్వూరు: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆంధ్రా షుగర్స్ భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణ మూర్తి సూచించారు. కొవ్వూరు ఫ్యాక్టరీలో శుక్రవారం కార్మికులు, ఉద్యోగులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రయోగాత్మకంగా వివరించారు. హెచ్ఆర్ ఏజీఎం సీహెచ్ సుఖ మహర్షి, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎ.రఘు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



నామా సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రకాశం

తాళ్లపూడి: తాళ్లపూడి పట్టణ కాపు సంఘ అధ్యక్షుడి ఎన్నిక సభ్యుల వాదోపవాదాల మధ్య జరిగింది. మండల కాపు సంఘ అధ్యక్షుడు నామా ప్రకాశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణ కాపు సంఘ అధ్యక్షుడిగా నామా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మైగాపుల రాజారావు, కార్యదర్శిగా ఉటుకూరి శ్రీను, గౌరవాధ్యక్షులుగా నామన పరమేశ్వరరావు, వంబోలు పోశిబాబు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా మారిశెట్టి చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీగా గోలి మణికంఠ, 15 మంది సభ్యులను నియమించారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

దేవరపల్లి: ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సర్పంచ్ కడిమి వీర కుమారి తెలిపారు. దీనిపై శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 5,800 గృహాలు ఉండగా, సుమారు రూ.70 లక్షల పన్నులు వసూలు చేయాలన్నారు. ఇప్పటి వరకూ రూ.30 లక్షలు వసూలు చేశారని, ఈ నెలాఖరుకు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. దీనికి సిబ్బంది కలసికట్టుగా పనిచేయాలన్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్.రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేయకుండా చూడండి

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో ఎస్సీ ఏరియాకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చెత్తను తీసుకువచ్చి సిబ్బంది పారబోస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ చెత్తను కాల్చినప్పుడు దట్టమైన పొగతో ఇబ్బందులు పడుతున్నామంటూ వారు ఆ గ్రామ సర్పంచ్ మెండే వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి సుదీప్తికి శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. తమ ప్రాంతంలో చెత్త వేయకుండా పంచాయతీ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డోల్లా జాషువా, పి.నరసింహులు, రాయుడు సువర్ణరాజు, మద్రి మహలక్ష్ముడు, తూరుగోపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూత వచ్చే.. ఆశలు చిగురించే..

- కళకళలాడుతున్న జీడిమామిడి తోటలు
- మెట్టలో 29,500 ఎకరాల్లో సాగు
- శ్రమ తక్కువ.. ఆదాయం ఎక్కువ

దేవరపల్లి: జీడిమామిడి.. ఇక్కడి మెట్ట ప్రాంతంలో విరివిరిగా పండే పంట. శ్రమ తక్కువ ఆదాయం ఇచ్చే సాగు కావడంతో రైతులకు ఏటా సిరులు కురిపిస్తోంది. ప్రస్తుతం జీడిమామిడి తోటలు పూతతో కళకళలాడుతున్నాయి. ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే పూత వచ్చి మార్చిలో దిగుబడి అందుతుంది. జూన్ వరకూ పంట ఉంటుంది. మెట్ట ప్రాంతంలోని సుమారు 10 మండలాల్లో దీనిని సాగు చేస్తున్నారు. ఇసుక నేలలు, సాగునీటి సదుపాయం లేని ప్రాంతాలకు ఇది అనువైన పంట. పెట్టుబడి తక్కువ, నీటి తడులు రెండు, మూడు పెడితే సరిపోతాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గోపాలపురం, పోలవరం, చింతలపూడి, ఏలూరు, కొవ్వూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని మెట్ట భూముల్లో జీడి మామిడి సాగు చేస్తున్నారు. ఈ గింజలకు అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ ఉండడం, నాలుగైదు ఏళ్లుగా గిట్టుబాటు ధర రావడంతో రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా జీడిమామిడి పంట వేస్తున్నారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం రైతులను ప్రోత్సహించి రాయితీపై అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఎక్కువ మంది ఈ పంటను వేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది 20 రోజులు ఆలస్యంగా పూత వచ్చింది. లేత పూతలు బాగున్నాయని రైతులు తెలిపారు. ఎటువంటి తెగులు, చీడపీడలు లేకుండా తోటలు ఆరోగ్యకరంగా ఉన్నాయని అంటున్నారు.

ఎకరాకు రూ.లక్ష ఆదాయం

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 29,500 ఎకరాల్లో జీడిమామిడి సాగు జరుగుతోంది. ద్వారకాతిరుమల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పంట ఉంది. నీటి వసతి, యాజమాన్య పద్ధతులు పాటించని భూముల్లో ఎకరాకు 4 బస్తాలు, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి, యాజమాన్య పద్ధతుల్లో సాగు చేస్తున్న రైతులు 10 నుంచి 12 బస్తాల దిగుబడి సాధిస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష వరకూ ఆదాయం వస్తుంది.



రామన్నపాలెంలో పూతతో కళకళలాడుతున్న జీడిమామిడి తోట

ఆశాజనకంగా సాగు



జీడిమామిడి పూత ఆశాజనకంగా ఉంది. పూతలు లేతగా వచ్చినప్పటికీ ఎటువంటి తెగుళ్లు వ్యాపించలేదు. టీ దోమ ఎక్కడా కనిపించలేదు. ఉక్కబోత వాతావరణం, ఎండలు ఎక్కువగా ఉంటే త్వరగా గింజ పడుతుంది. ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉంది. ద్వారకాతిరుమల మండలంలో 5 వేలు, దేవరపల్లిలో 12 వేలు, గోపాలపురంలో 10 వేలు, నల్లజర్లలో 2,400 ఎకరాల్లో పంట సాగు జరుగుతుంది.

– ఎ.దేవదానం, ఉద్యాన శాఖ అధికారి, ద్వారకాతిరుమల

గింజల ధర బాగుంది



తక్కువ శ్రమ, ఎక్కువ ఆదాయం వచ్చే పంట జీడిమామిడి. ఏడాదిలో మూడు నెలలు కష్టపడితే పంట చేతికి వస్తుంది. ఏడాది పొడవునా నిల్వ ఉంటే పంట. మార్కెట్లో గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్ముకోవచ్చు. పాడైపోతుందనే భయం లేదు. గింజల ధర బాగుంది. గత ఏడాది బస్తా గింజలు (80 కిలోలు) రూ.10,500 ధర పలికింది. విచ్చలవిడిగా పురుగు మందులు పిచికారీ చేస్తే పూత దెబ్బతింటుంది.

–లంకసాని శ్రీనివాస్, రైతు, చిన్నాయగూడెం

అభయమివ్వు ఆంజనేయా..



పెద్దేవంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో మంత్రి తానేటి వనిత తదితరులు

తాళ్లపూడి: పెద్దేవంలోని చెరువు గట్టు వద్ద నిర్మించిన 27 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తాంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అట్టహాసంగా జరిగింది. తొలుత వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీఆంజనేయ.. జై ఆంజనేయ అంటూ భక్తులు స్మరించారు. హోం మంత్రి తానేటి వనిత విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు మంత్రి వనితను ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ, నాయకులు కుంట ముక్కల కేశవనారాయణ, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుని ఆలయ ప్రతిష్ఠాపన



కురుకూరులో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపనలో మంత్రి తానేటి వనిత



ఆలయ ప్రతిష్ఠాపన పూజలకు హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: కురుకూరులో దాతలు, గ్రామస్తుల విరాళాలు రూ.కోటితో నిర్మించిన అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. తి.తి.దే వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా విభాగం కన్వీనర్ గారపాటి రమాప్రభ, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు, గ్రామస్తులు మంత్రి వనిత, ఎమ్మెల్యే వెంకట్రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది.

కమనీయం.. గోపాలస్వామి కల్యాణం



తాళ్లపూడిలో మదనగోపాలస్వామికి వెండి కిరీటం సమర్పిస్తున్న సర్పంచ్ దంపతులు

తాళ్లపూడి: తాళ్లపూడిలో వివాహాల దేవుడు, సంతాన గోపాలుడిగా ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తుల కల్యాణాలను తిలకించడం ద్వారా శుభాలు చేకూరతాయని పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ అన్నారు. పరస వంశస్తులతో పాటు పాటు పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. అమలాపురం నుంచి వచ్చిన వేద పండితులు, ఆలయ అర్చకులు గోవర్ధనం సూర్యరాజగోపాల్, జనార్దన్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. పుణ్యహవాచనం, ధ్వజారోహణం, హోమాలు, గరుడ హోమం తదితర పూజలు జరిగాయి. మదన గోపాలస్వామిని, ఆలయ ప్రాంగణంలోని మండపాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామివారికి కల్యాణం సందర్భంగా సర్పంచ్ నక్కా అనురాధ, చిట్టిబాబు దంపతులు రూ.50 వేల విలువైన వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి కిరీటాన్ని స్వామివారికి అంకరించారు. అనంతరం రాధా మనోహర్ దాస్ ప్రవచనం జరిగింది. సింహాద్రి జనార్దనరావు, కంకిపాటి సాయి, బొర్రా శ్రీరామచంద్రమూర్తి, నీలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: జిల్లా, మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోడ్ నిబంధనల ప్రకారం కొత్తగా ఎటువంటి పనులను ఆమోదించడం లేదని చెప్పారు. గతంలో చేపట్టిన రోడ్లు, డ్రైన్లు, పైపులైన్ ఏర్పాటు పనులు సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతగా చేపట్టాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కానుబోయిన ప్రభావతి, వడల రత్నకుమారి, ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారు చేద్దాం..



పాలంగిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి జగదాంబ

ఉండ్రాజవరం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా సంపద సృష్టించి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకువెళ్దామని జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ అన్నారు. మండలంలో పాలంగి, వేలివెన్ను గ్రామ పంచాయతీలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓహెచ్ఆర్ ట్యాంకుల వద్ద క్లోరినేషన్‌పై ఆరా తీశారు. వచ్చేది వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికగా సాగాలని ఆదేశించారు. పాలంగిలో కొత్తగా నిర్మిస్తున్న సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, కార్యదర్శి హసన్‌జానీ, వంగ శ్రీనివాసు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొవ్వూరు: కుమారదేవం గండిపోశమ్మ గుడి సమీపంలో గత నెల 24న బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన పూసం సోమరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలవరం పీహెచ్‌సీలో ఎంఎన్‌వోగా పనిచేస్తున్న సోమరాజు రాజానగరంలో జీఎస్ఎస్ ఆసుపత్రికి వెళ్లి తిరిగి బైక్‌పై పోలవరం వెళుతుండగా మార్గ మధ్యంలో ఈ ప్రమాదం జరిగింది. కాలికి ఆపరేషన్ చేయాల్సి రావడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ వివరించారు.

సారా కేసులో ఒకరి అరెస్ట్

తిరుగుమెట్టలో వడ్లమూడి గణపతి మణికంఠని సారా కేసులో శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సారా సరఫరాదారుడు చిక్కాలకి చెందిన కాసాని కోట సత్యనారాయణ పరారీలో ఉన్నట్లు ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

నల్లజర్ల: అనంతపల్లిలో పేకాట శిబిరంపై గురువారం నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా పది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.75,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మత్తు మందు ఇచ్చి చోరీ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు

నిడదవోలు రూరల్: ఓ వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి 13 కాసుల బంగారం దొంగిలించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు నిడదవోలు ఎస్సై పి.నాగరాజు శుక్రవారం తెలిపారు. నిడదవోలులోని కరూర్ వైశ్యా బ్యాంక్ వెనుక సీహెచ్ జయలక్ష్మి (70) నివాసం ఉంటున్నారు. ఈ నెల 2వ తేదీ ఉదయం 11.30 గంటలకు సుమారు 30 ఏళ్ల వయసు కలిగిన మహిళ వచ్చి ఇంట్లో పని చేస్తానని చెప్పి ప్రవేశించింది. ఎవరూ లేని సమయంలో జయలక్ష్మికి మత్తు మందు ఇచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసుతో పాటు రెండు బంగారు గాజులు అపహరించింది. ఘటనా స్థలాన్ని సీఐ కె.వెంకటేశ్వరరావు పరిశీలించి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి కొడుకు సీహెచ్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ సుభానీ శుక్రవారం తెలిపారు. సమిశ్రగూడేనికి చెందిన వెలుపూడి వెంకటేష్‌తో అంబికకు 2005లో వివాహమైంది. ఇటీవల తన భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అంబిక ఫిర్యాదు చేసింది.

మహిళకు కరోనా

ఉండ్రాజవరం: చివటంలో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు ప్రసాద్ మాట్లాడుతూ కువైట్ నుంచి 1న వచ్చిన మహిళకు విమానాశ్రయంలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చిందన్నారు. ప్రస్తుతం ఆమెను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచామని తెలిపారు. తహసీల్దార్ జి.కనకరాజు మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, మాస్కులు ధరించి జాగ్రత్తలు పాటించాలన్నారు.

పచ్చని చెట్లపై వేటు

- అడ్డుకున్న గ్రామస్తులు

నల్లజర్ల: పోతవరం– ఆరిపాటి దిబ్బల మధ్య రహదారి నిర్మాణ పనులు పూర్తయి ఏడాదిన్నర అయ్యింది. అప్పట్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లన్నీ నరికేశారు. ఇప్పుడు తాజా మళ్లీ చెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టాడో కాంట్రాక్టర్. నాలుగు రోజులుగా పెద్ద సైజు చెట్లన్నీ యంత్రాలతో సాయంత్రం నరికి తరలించడాన్ని స్థానికులు గుర్తించి శుక్రవారం వారిని అడ్డుకున్నారు. చెట్లు నరకడానికి మీకు అనుమతులు ఎవరిచ్చారంటూ ప్రశ్నించడంతో రహదారి భవనాల శాఖ జేఈ అనుమతి ఇచ్చారంటూ ఏదో పత్రం చూపారు. రహదారి పక్క వాహనాలకు అడ్డువచ్చే కొమ్మలు నరకమని అనుమతి ఇస్తే భారీ వృక్షాలను తొలగిస్తున్నారంటూ గ్రామస్తులు ఘంటా రవి, పెండ్యాల వీరరాఘవులు, కంకిపాటి వెంకటస్వామి, కానూరి రాజు, ఘంటా నాగభూషణం, అఫీఫ్ తదితరులు అడ్డుకున్నారు. భారీ చెట్ల మొదళ్లు హైదరాబాద్ వంటి నగరాలకు ఫర్నిచర్‌కు, కొమ్మలను పొగాకు క్యూరింగ్‌కు అమ్మేసి కాంట్రాక్టర్, సంబంధిత ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. చెట్లు కొడుతున్న వారి దగ్గర సామగ్రి లాక్కొని పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పోతవరం శివారులో రహదారి పక్కన చెట్లను నరికి తరలిస్తున్న వారిని అడ్డుకున్న గ్రామస్తులు